పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న గంజి వెంకటేశం నేత

మన్సూరాబాద్: పద్మశాలీయుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటును ప్రకటించడం హర్షణీయమని పద్మశాలి సంఘం మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు గంజి వెంకటేశం నేత అన్నారు. మన్సూరాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వం రాష్ట్రంలో తొలిసారిగా పద్మశాలి కార్పొరేషన్‌ను ప్రకటించడమే కాకుండా, రాష్ట్ర మంత్రి మండలి పద్మశాలి కార్పొరేషన్ నిర్ణయానికి మద్దతు తెలపడం సంతోషకరమన్నారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయటంపై రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రిమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గజం సత్యనారాయణ నేత, గౌరవ అధ్యక్షుడు గంజి సత్తయ్యనేత, ఉపాధ్యక్షుడు రుద్ర లక్ష్మీ నర్సింహనేత తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ పరీక్షలపై కామినేనిలో ప్రత్యేక ప్యాకేజీ



ప్రత్యేక ప్యాకేజీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నెఫ్రాలాజిస్ట్ సంతోష్‌కుమార్ తదితరులు

మన్సూరాబాద్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో కిడ్నీ పరీక్షలపై ప్రత్యేక ప్యాకేజీ బ్రోచర్‌ను కన్సాల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సంతోష్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఇందులో ఎలక్ట్రోలైట్స్, సీరం క్రియోటినైన్, కిడ్నీ యూరేటర్– బ్లాడర్ అల్ట్రాసౌండ్ స్కానింగ్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, యూరిన్ ప్రొటీన్, క్రియోటినైన్ రేషియో, కంప్లీట్ యూరిన్ పరీక్ష, ఆర్‌బీఎస్, నెఫ్రాలజిస్ట్ కన్సల్టేషన్ ఉంటాయన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ అరుణ తదితరులు

చంచల్‌గూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా గురువారం కుర్మగూడ డివిజన్ భరత్‌నగర్‌లో ఎంపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సైదాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి అన్ని రంగాల్లో ప్రతిభను చాటాలన్నారు. మహిళలు మొత్తంగా సమాజానికే స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా టీఆర్ఎస్ మహిళ అధ్యక్షురాలు సుర్గి అనిత, తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కోవ సాయిలక్ష్మి, ప్రతినిధులు లావణ్య, అలివేలు, కట్ట సుదర్శన్, లలిత తదితరులున్నారు.

మోదీ పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలి

చైతన్యపురి: ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్ గెలుపునకు బీజేపీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అన్నారు. గురువారం బీజేపీ అభ్యర్థి ఎన్నికల ప్రచార రథాన్ని కార్పొరేటర్ జండా ఊపి ప్రారంభించారు. నాయకులు రుదారపు శంకర్, వినోద్‌యాదవ్, కృష్ణప్రకాష్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడి పరీక్షలు రాస్తే ఎక్కువ మార్కులు

చంపాపేట: విద్యార్థులు ఆందోళన, భయం లేకుండా పరీక్షలకు హాజరైతే అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులవుతారని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి హాజరై విద్యార్థులకు పలు సబ్జెక్ట్‌లపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్ ఉపాధ్యాయులు బీనా, అవీనా, గీతాంజలి, శేఖర్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం.. నిందితుడిపై కేసు నమోదు

చంచల్‌గూడ: మలక్‌పేట సివిల్ సప్లై శాఖ పరిధిలోని చావణీ ప్రాంతంలోని గోడౌన్‌లో ఓ వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఒక క్వింటల్ గోధుములను సివిల్ సప్లై శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై మాదన్నపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారులు గత మంగళవారం చావణీలోని మౌలానా హోటల్ వద్ద సలీమ్ జాఫర్ అలియాజ్ సలీమ్ (74)కు చెందిన ఒక గోడౌన్‌పై దాడి చేయగా దాదాపు 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఒక క్వింటల్ గోధుమలు లభ్యమయ్యాయి. దీంతో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు కవిత బుధవారం మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడికి నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. పీడీఎస్ బియ్యం నిల్వకు సంబంధించి నిందితుడిపై గత జనవరిలో కూడా ఇదే స్టేషన్‌లో కేసు నమోదు కావడం గమనార్హం.

10 తులాల బంగారు గొలుసు చోరీ

కేర్‌టేకర్‌పై పోలీసులకు ఫిర్యాదు

చంచల్‌గూడ: గుండె జబ్బుతో బాధపడుతున్న వృద్ధుడికి కేర్‌టేకర్‌గా చేరిన వ్యక్తి ఇంట్లోని 10 తులాల బంగారు గొలుసుతో ఉడాయించాడు. సైదాబాద్ పోలీసు స్టేషన్‌లో పరిధిలో ఈ ఘటన జరిగింది. వివరాలు... ఐఎస్ సదన్ డివిజన్ నివాసి సామ సందీప్‌రెడ్డి తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతుండటంతో అతడిని చూసుకోవడానికి తెలిసిన వ్యక్తుల ద్వారా గత జనవరిలో గుంటూరుకు చెందిన సూరం బ్రహ్మారెడ్డి (35)ని కేర్‌టేకర్‌గా పెట్టుకున్నాడు. గత బుధవారం బ్రహ్మారెడ్డి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. అతడిని సంప్రదించేందుకు పలుమార్లు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇదే క్రమంలో ఇంట్లో మంచంపై పెట్టిన తన రూ. 2 లక్షల 70 వేలు విలువైన 10 తులాల బంగారు రుద్రాక్ష మాల కనిపించడం లేదని బాధితుడి నాయనమ్మ తెలిపింది. దీంతో బ్రహ్మారెడ్డి చోరీకి పాల్పడి పరారైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నత్తనడక పనులతో అవస్థలు

- ఏడాదిగా కొన.. సాగుతున్న వరద కాలువ పనులు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న బీఎన్‌రెడ్డినగర్ వాసులు



బీఎన్‌రెడ్డి నగర్‌లో కొనసాగుతున్న వరద కాలువ పైప్‌లైన్ పనులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్‌లో వరదనీటి కాలువ పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ముంపు సమస్య నుంచి కాలనీలకు శాశ్వత విముక్తి కలిగించేందుకు ప్రారంభించిన ఈ కాలువ నిర్మాణ పనులు అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఏడాదిగా నెమ్మదిగా జరుగుతున్నాయి.

- ఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని కప్రాయి చెరువు కింది కాలనీలతో పాటు ఎగువ కాలనీలకు చెందిన వరదనీరు ఈ కాలువ ద్వారా పెద్ద అంబర్‌పేట చెరువులోకి వెళ్తాయి. తరచూ వర్షాకాలంలో ఈ వరద నీటి వలన పలు కాలనీలు ముంపునకు గురికావడంతో పాటు వరద నీరు ఇళ్లలోకి చేరుతోంది. ఈ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కాలువ పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఇవి నత్తనడకన సాగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మండిపడుతున్నారు.

వాహనదారులకు ఇబ్బందులు

ఈ పైప్‌లైన్ నిర్మాణంతో రోడ్డును మూసేయడంతో పక్కనున్న ప్లాట్ల నుంచి వాహనాల రాకపోకలను మళ్లించారు. ఈ దారి రాళ్లు తేలి గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే వరద కాలువ పనులను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని విశ్రాంత ప్రొఫెసర్ సి.గణేష్ అన్నారు. యువతలో పెరుగుతున్న హింస ప్రవృతి కారణాలపై పరిష్కారాలు అనే అంశంపై నక్క వెంకటేష్ అధ్యక్షతన కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రావ్ భవన్‌లో అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గణేష్‌తో పాటు ప్రొఫెసర్ జీబీ రెడ్డి, అడిషనల్ ఎస్పీ తిరుపతిరెడ్డి, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పెరిక యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావం వల్ల ఎక్కువగా చెడిపోతున్నారని తెలిపారు. యువత సరైన మార్గంలో ప్రయాణించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదల చాలా ముఖ్యమని అన్నారు. సరైన మార్గదర్శనం లేకపోవడం వల్ల యువత వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గట్టు మల్లు, డాక్టర్ శివాజీ, మన అశోక్ యాదవ్, మేడి నాగరాజ్, జంతుకు శంకర్, సతీష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌తో పేద ఆర్యవైశ్యులకు ఎంతో మేలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్యవైశ్య కార్పొరేషన్‌తో పేద ఆర్య వైశ్యులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో గురువారం ఆర్‌కేపురం డివిజన్‌లోని హరిపురి కాలనీలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తున్నదని అన్నారు. జిల్లా ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గందె సురేష్, కోశాధికారి బిల్లకంటి కిరణ్ కుమార్, అష్టలక్ష్మి ఆలయం మాజీ చైర్మన్ బంధం దామోదర్, అష్ట లక్ష్మి ఆలయం ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, శ్రీను బాకర్, మంచుకొండ సురేందర్, బిజ్జాల వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జులాయిగా తిరగవద్దన్నాడని.. మేనమామ, అత్తలపై కత్తితో బాలుడి దాడి



దాడిలో గాయపడ్డ చిరంజీవి, ప్రియ

హస్తినాపురం: చెడు మార్గంలో వెళ్లొద్దని మందలించిన మేనమామ, అత్తలపై బాలుడు కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వై.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ ప్రాంతానికి చెందిన చిరంజీవి(43) తన భార్యను ప్రియను తీసుకొని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాయత్రినగర్ బ్యాంకు కాలనీ శివారులో ఉండే అక్క ఇంటికి గురువారం మధ్యాహ్నం వచ్చాడు. మేనల్లుడు (బాలుడు) జులాయిగా తిరుగుతున్నాడని తెలిసి అలా తిరగొద్దని, బైక్ వాడొద్దని మందలించాడు. దీంతో కోపోద్రేకుడైన మేనల్లుడు (బాలుడు) ఇంట్లోకి వెళ్లి చాకు తెచ్చి తన మామపై దాడి చేశాడు. అత్త ప్రియ అడ్డు రాగా ఆమెపై కూడా దాడికి పాల్పడ్డాడు. చిరంజీవి, ప్రియలకు రక్త గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు వారిని ఆసుపత్రికి తరలించారు. బాధితుడు చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మలిదశ ఉద్యమ నేత.. 'మొగిలిపువ్వు' మృతి



మొగిలిపువ్వు నారాయణ(ఫైల్)



ఉద్యమ సమయంలో కేసీఆర్ పచ్చబొట్లతో నారాయణ (ఫైల్)

చంపాపేట: తెలంగాణ మలిదశ ఉద్యమ నేత మొగిలిపువ్వు నారాయణ(62) అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో గురువారం మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం నిమ్మబాయి గ్రామానికి చెందిన నారాయణ తన భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమారులతో కలిసి 25 సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చారు. చంపాపేటలోని కటకోనికుంట కాలనీలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఏర్పాటు చేసిన ప్రతి సమావేశానికి హాజరై ఉద్యమ స్ఫూర్తి పొందారు. నారాయణ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో అరగుండుతో ఆంధ్ర పాలకులకు పిండ ప్రదానం, ఆంధ్రావాలా హఠావో.. తెలంగాణ బచావో అనే నినాదంతో రాస్తారోకోలు, నిరాహార దీక్షలు చేశారు. కేసీఆర్ పిలుపు మేరకు ఆయన మిలియన్ మార్చ్ కార్యక్రమానికి పోలీసుల కళ్లుగప్పి విచిత్ర వేషధారణతో హాజరయ్యారు. ఎల్‌బీనగర్‌లో ప్రధాన ఉద్యమకారుడిగా పేరొందిన నారాయణను పోలీసులు పలుమార్లు హౌస్ అరెస్టులు చేయటమే కాకుండా సైదాబాద్, కంచన్‌బాగ్, సరూర్‌నగర్, సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.

ఇటీవల కాంగ్రెస్‌లో చేరిక..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఆయన కొంతకాలం టీఆర్ఎస్ పార్టీలో కొనసాగారు. పార్టీ విధానాలు ఆయనకు నచ్చక పోవటంతో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. నారాయణ భౌతికఖాయాన్ని అంత్యక్రియల నిమిత్తం ఆయన స్వగ్రామం జడ్చర్లకు తరలించారు. ఇదిలా ఉండగా, నారాయణ తన కుటుంబంతో కలిసి కటకోనికుంట కాలనీలోని కిరాయి ఇంట్లో ఉండేవారు. అనారోగ్యంతో మృతి చెందటంతో నారాయణ భౌతిక కాయాన్ని ఇంట్లో ఉంచేందుకు యజమాని అంగీకరించక పోవటంతో ఆయన పార్థీవ దేహాన్ని కాలనీవాసుల సందర్శనార్థం నడిబజారులో ఉంచారు. ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయనకు ఇలాంటి దుస్థితి ఏర్పడటంపై స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

నాయకుల నివాళి.

నారాయణ మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కిరణ్, గోపాల్ ముదిరాజ్, యాదగిరి, బీఆర్ఎస్ పార్టీ నేతలు నల్లా రఘుమారెడ్డి, ఉద్యమకారులు రాము, లక్ష్మణ్, నర్రె శ్రీనివాస్, నర్సింహారెడ్డి, ప్రవీణ్, బీజేపీ నాయకులు అనిల్, పాశం శ్రీశైలం హాజరై నివాళులు అర్పించారు. నారాయణ కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయం అందచేయడమే కాకుండా వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో రేయాన్ విద్యార్థుల ప్రతిభ



ఆలిండియా స్థాయిలో ప్రతిభ కనబరిచిన రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు

నాగోలు: దేశ వ్యాప్తంగా నిర్వహించిన సైనిక్ స్కూల్–2024 ఫలితాల్లో నాగోలు బండ్లగూడలోని రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు 81 మంది ఎంపికయ్యారని స్కూల్ చైర్మన్ జి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. రేయాన్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలలో 284 టాప్ మార్క్స్‌తో పాటు 81 మంది దేశ వాప్తంగా తమ విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన అన్నారు.

సరూర్‌నగర్ ఠాణాను సందర్శించిన రాచకొండ సీపీ



సరూర్‌నగర్ పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

చైతన్యపురి: రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి గురువారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలు, రిసెప్షన్ పనితీరును ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేందుకు పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ వెంట ఎల్‌బీనగర్ డీసీపీ శ్రవణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య వున్నారు.

సాయిబాబాను దర్శించుకున్న సీపీ

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయాన్ని గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, ఎల్‌బీనగర్ డీసీపీ శ్రవణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య సందర్శించారు. వేదపండితులచే పూర్ణకుంభంతో సంస్థాన్ చైర్మన్ గుండ మల్లయ్య వారికి స్వాగతం పలికారు. బాబా సన్నిధిలో జరిగిన ప్రత్యేక పూజలు, అర్చనల్లో కమిషనర్, డీసీపీ పాల్గొన్నారు. అనంతరం వారికి బాబా ప్రసాదాన్ని చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ రంగంలో తిరుగులేనిది భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందిస్తున్న భారతీ సిమెంట్ సంస్థ సిబ్బంది

ఎల్‌బీనగర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదుగుతున్నదని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ జెడ్‌పీ రోడ్డులోని శ్రీభవానీ స్టీల్ ట్రేడర్స్‌లో గురువారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సాత్విక్‌రెడ్డి మాట్లాడుతూ, అల్ట్రాఫాస్ట్ పేరుతో 5 స్టార్ గ్రేడ్‌తో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను భారతి సిమెంట్ సంస్థ విడుదల చేసిందన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారుల నిర్మాణానికి సరియైన ఎంపిక అని అన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో భారతి సంస్థ నిపుణులైన ఇంజినీర్లు వినియోగదారుల వద్దకు వచ్చి సాంకేతిక సాయం అందిస్తారని తెలిపారు. అనంతరం 40 మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల విలువ చేసే ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ అయ్యప్ప రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ నర్సింహులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



కమర్షియల్ ట్యాక్స్ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ కమర్షియల్ ట్యాక్స్ కాలనీలో రూ.7 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ లైన్ పనులు చేపట్టారు. ఈ పనులను కార్పొరేటర్ గురువారం పరిశీలించారు.పాత డ్రైనేజీ లైన్ వల్ల తరచూ సమస్యలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తొందరగా నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ పనుల వల్ల స్థానికులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జలమండలి అధికారులు ఆరిఫ్, దయాకర్‌లకు సూచించారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ కాలనీ అధ్యక్షుడు అంజయ గౌడ్, విశ్వేశ్వర్ రావు, సురేందర్ నాయకులు సుందర్ నారాయణ, అశ్విన్ సింగ్, కొత్త తిరుమల, మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలకు వెంటనే చికిత్స చేయించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ముందు జాగ్రత్త చర్యలతో కిడ్నీ సమస్యలను గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలోని గ్లెనీగల్స్ అవేర్ ఆసుపత్రిలో కిడ్నీ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి, ఆసుపత్రి సీఓఓ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, నగరంలో మూత్రశాలలు లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారని, మూత్రాన్ని ఎక్కువ సమయం ఆపుకోవడం వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయన్నారు. అతిగా మద్యం, ధూమపానం, మాంసాహారం తీసుకోవడం వల్ల కిడ్నీలు పాడయ్యే అవకాశం ఎక్కువగా ఉందని అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా తమ ఆసుపత్రిలో రూ.999లకే కిడ్నీకి సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షల ప్యాకేజీని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు పూల నవీన్‌కుమార్, వేణు మన్నే, ప్రభు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూముల అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలి

నాగోలు: రద్దు అయిన భూదాన్ బోర్డ్ పేరుతో గాంధీ భవన్‌లో కార్యాలయం పెట్టుకొని అక్కడి నుంచి భూదాన్ భూముల అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డిని అక్కడి నుంచి తరిమేసి సీఐడీతో విచారణ చేయించాలని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. సర్వోదయ మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహాసభ గురువారం నాగోలు సాయినగర్ కాలనీలోని సర్వోదయ మండలి కార్యాలయంలో మండలి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కె. చందు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్ నాయక్ మాట్లాడుతూ, దేశంలోనే మొదటిసారిగా పోచంపల్లి గ్రామంలో వేదిరే రామచంద్రా రెడ్డి భూములను దానంగా ఇచ్చి, గ్రామాన్ని భూదాన్ పోచంపల్లిగా పేరు తెచ్చారన్నారు. భూదాన్ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణకు గురికాకుండా కాపాడేందుకు మరోసారి భూదాన్ ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. మహాసభల్లో జిల్లా నాయకులు సహిదా బేగం, యాకూబ్ పాషా, ధనమ్మ , శ్రీనివాస్,. ఆరే కంటిరాములు, కొమ్ము యాదగిరి అచ్చలి, కమల, కొమ్ము రాములు తదితరులు పాల్గొన్నారు

నేరాల నివారణకు సీసీ కెమెరాలు దోహదం

వనస్థలిపురం: ఒక సీసీ కెమెరా 100 మంది సిబ్బంది నిఘాతో సమానమని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మహిళలు, ప్రజల రక్షణకు, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ ఘటనల నివారణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని అన్నారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, నేరాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమని, ప్రతి కాలనీలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, కాలనీ అధ్యక్షుడు టీవీ రావు, మాజీ అధ్యక్షుడు రాజ్‌కిరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రీన్ చానల్‌లో గుండె తరలింపు



లింగోజిగూడ: రాచకొండ పోలీస్ కమిషనరేట్ సిబ్బంది గ్రీన్ చానల్ ద్వారా గుండెను విజయవంతంగా తరలించారు. ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలోని గ్లెనిగల్స్ అవేర్ ఆసుపత్రి నుంచి గుండెను మరొకరికి అమర్చేందుకు గురువారం ఉదయం జూబ్లీహిల్స్ అపోలోని ఆసుపత్రికి పంపారు. గ్రీన్ చానల్ ద్వారా పోలీసులు అంబులెన్స్‌లో గుండెను 29.1 కిలో మీటర్ల దూరంలోని ఆసుపత్రికి 37 నిమిషాల్లో తరలించారు. గుండెను తరలించే రహదారిలో ఎక్కడ కూడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు ముందుస్తు చర్యలు తీసుకోవడంతో ఉదయం 9.19 నిమిషాలకు బైరామల్‌గూడ నుంచి బయలుదేరిన అంబులెన్స్ 9.57 నిమిషాలకు అపో ఆసుపత్రికి చేరుకుంది. గ్రీన్ చానల్ ద్వారా గుండెను తరలించేందుకు సహకరించిన రాచకొండ పోలీసులకు రెండు ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.